పతివ్రత?

శ్రీ ఆంజనేయశాస్త్రి

"నెత్తురుకూడా పడ్డదే, నిన్న రాత్రి దగ్గినప్పుడు..." అన్నాడు భర్త, నీరసంగా భయపుచూపులు చూస్తూ భార్యతో. ఆ విషయం భర్తకు తెలీకుండా వుంటానికని, ఆయన మొహాని కడ్డంగా నుంచుని, తాను మనస్సులో పడుతున్న అమితమైన ఆందోళనను పైకి కనపడనీయకుండా రాత్రి ఆయన ఉమ్మేసిన స్థలం చకచకా బాగుచేస్తున్న భార్య గుండె లామాటలు వినేటప్పటికి ఝల్లుమన్నాయి. అప్పుడే ఎక్కడ చూశాడో? దీపం దూరంగానే పెట్టిందికూడాను. ఒక్క నిముషం ఏమీ సమాధానం చెప్పలేక వినిపించుకోనట్టూరుకుంది. "కిందటినెల, పోలేదూ? మా దుకాణంలో వుండే రెంగో గుమాస్తా? ఆయనకూడా యిల్లాగే నెత్తురు పడ్డదట చివరిరోజుల్లో..." అన్నాడు మళ్లా భర్తే. వినిపించికూడా, వినిపించనట్టూరుకుందని అతనికి తెలుసు.

"...ఛీ... నెత్తురు కాదండీ అబ్బే, నేనిప్పుడేగా బాగుచేస్తుంటేను? ఎర్ర సిరా మొన్న యిక్కడ ఒలకలేదూ?... అదీ..." అని రెండు నెలలకిందటే సరైన పోషణలేక నీరసించి చచ్చిపోయిన తన కొడుకుమాట గుర్తొచ్చి మాట పొంతం చెయ్యకుండానే ఛప్పున ఆగిపోయింది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. "సిరాబుడ్డి ఒరగతోసేవాళ్లెవరున్నారూ యిప్పుడు ...ఛీ...ఆ మాట గుర్తు చేశానేం? యిప్పుడు దిక్కుమాలిన దాన్ని..." అని తన్ను తాను తిట్టుకొని మనస్సులో, కన్నీళ్లు కళ్లతోనే మింగేసి భర్తతో ఏదో చెప్పబోతుంటే, ఆయనే అందుకుని..."అది చూసి నెత్తురనుకున్నాననా నీ ఉద్దేశం?...అయినా సిరా ఎవరు ఒలకపోస్తారూ?..."అన్నాడు, బిక్కమొహం వేసి. అనుకున్నంతా జరిగింది. "...ఊ-హూఁ అది కాదు...వైద్యుడు చెప్పనే చెప్పాడుగా తగ్గుమొహంలో కొచ్చిందనీ? అదీ కాక మొహంకూడా తేటగానే కనిపిస్తోంది మూడు రోజుల నుంచీని ..." అంది భార్య, మాట తప్పించటానికి. రోగి కొంచెంగా దగ్గి "...పిచ్చిదానా, నేను భయపడుతానని తప్పించేస్తున్నావా? గుబగుబా కొట్టుకొంటున్న నీ గుండెలు వీపుమీదికూడా కనిపిస్తునే వున్నాయి ... నాకు తెలుసు ... నేనిహ బతకను...చిట్టిబాబు సగం ప్రాణాలు తీసికెళ్ళాడు ...ఈరోగ..." ...తరవాత బాగా దగ్గొచ్చింది. మాట్టాడ లేకపోయాడు. భార్య ఒళ్లు ముచ్చెమటలు పోసింది. ధైర్యంఎలాగో చిక్కబట్టుకొంటూ లేచి, మొహంతుడుచుకొని, భర్తవేపు తిరక్కుండానే ... ... "ఇదిగో ... ఇల్లాంటిమాట లంటేనే!... డాక్టరుగారు చెప్పలేదూ? భయపడవద్దనీ, భయపడితే ఎక్కువౌతుందనీ జబ్బు?... నాకోపం ఒస్తుందికూడానూ..." అంటూ

లేనికోపం తెప్పించుకొని కాస్త గంభీరంగా, కసిరినట్టు మాట్లాడింది. మాటలుమట్టుకు అంది, తప్పితే ఒళ్లంతా ఒణికిపోతోంది. పెదిమెలు అదురుతున్నాయి. దగ్గిదగ్గి రోగి ఉమ్మేశాడు. రక్తం స్పష్టంగా కనిపించింది. సార్థకంగా చూశాడు, భార్యకేసి. ఇందాకటినుంచీ ఆమెమొహంలో అణువణువునుంచీ ఉబుకుకొస్తున్న భయాన్నీ, దుఃఖాన్నీ పాపం ఆమె నిర్బలహృదయం, ఇహ ఆపలేక పోయింది, కుప్పన కూలబడిపోయి మంచంపట్టెకి తలానిచ్చి ఎక్కెక్కేడవడం మొదలెట్టింది. తనస్థితిని చూచుకొని కాకపోయినా, తానుపోయింతర్వాత భార్యయొక్క స్థితిని గ్రహించుకుని భర్తకూడా బాగా బిక్కమొహం పెట్టాడు. ఎండిపోయిన వేళ్ల ఎముకల్తో భార్యజుట్టు సవిరిస్తూ తలెత్తి... "ఇంతేనా మరి? వెఱ్ఱిపిల్లా... మొన్న మందు మార్చింతర్వాత నాకూడా బాగా యిదిగానేవుంది ... ఏమంటావో నువ్వని అన్నాగానీ, తప్పకుండా నయమౌతుందిగా ..." అన్నాడు. తాను అబద్ధమాడుతున్నట్టు అతనికీ తెలుసు. నయమవటం అసంభవమని ఆవిడకీ తెలుసు—పరుపంచూ మంచంపట్టె తడిసిపోయాయి—

౨

విశ్రాంతి తీసుకోమని సలహా యిచ్చారు వైద్యులు. ఎన్నిరోజులని విశ్రాంతి తీసుకుంటాడు పని మానేసి? పని చెయ్యకపోయినా జీత మిస్తారుగనకనా? అసలా దుకాణంలో ప్రవేశించినదగ్గిర్నుంచే పట్టుకుంది రోగం. అనటం గుమాస్తాపనేఅయినా, పొద్దస్తమానం, గంటలతరబడిగా ఆలోపలి కొట్లల్లో రాస్తూరాస్తూ మగ్గిపోతుంటే ఆరోగ్యం చెడిందంటే చెడదూ మరి? మొదట్లో, రాత్రిళ్లు యింటికెళ్లేవేళకు కాస్తపుల కరం తగుల్తూవచ్చింది. రెండుమెతుకులు నోట్లో వేసుకొని పడుంటే ఏఅర్ధరాత్రివేళకో తగ్గిపోయేదో ఏమో తెల్లారేసరికి మామూలుగానే వుండేది. అంతమాత్రానికే పని మానేస్తే బతికేదెల్లా? తరవాత పొడిదగ్గొస్తూవచ్చింది. దానికీ అట్టే లక్ష్యంచెయ్యక ఏపటికబెల్లమ్ముక్కో దవడ నేసుకుని గడిపేసేవాడు. "ఎదన్నామందు పుచ్చుకోరాదుటండీ? శరీరం మరీ బలహీన మైపోతోం"దని అంటూ వచ్చేది భార్య అప్పుడప్పుడు. "మందులక్కూడా డబ్బెక్కడ మిగులుతుంది నాసంపాదనలో? మూడున్నర చెప్పాడు మొన్నీ మధ్య కనుక్కుంటే సీసా ..." అనేవాడు నిస్పృహతో. తర్వాత, తర్వాత ... "క్షయవ్యా"ధని స్పష్టంగానే చెప్పేశారు వైద్యులు. అప్పుడు తప్పనిసరిగా ఎదో మందు పుచ్చుకోవాలి సొచ్చింది. అప్పటికీ లొంగకపోతే, "మందులవల్ల లాభంలేదు. పూర్తిగా విశ్రాంతి అవుసరం ..." అన్నారు. ఏంవిశ్రాంతి? పొద్దూకులూ పనిచేస్తేనేగాని నాలుగు రాళ్లు చేతులో పడవయ్యె. ఆనాలుగురాళ్లూ వుంటేనేగాని పొయిలో పిల్లి లేవదు. ఇహ ఓటే విశ్రాంతి! శాశ్వతమైంది!! అదైనా వెంటనే ఒస్తే బాగానే వుండును!

మరీ ఉద్ధృతంగా వున్నప్పుడు నాలుగు రోజులు పనిమానేసేవాడు. కాస్త ఉపశాంతిగా వుండగానే, తప్పనిసరి కావటంచేత మళ్లీ పనిలోకిపోవటం. వారంరోజులు ఆ కూపంలో పడి కొట్టుకోపోగానే మళ్లీ మొదటికి రావటం. యజమానిపుణ్యామా

అంటూ మధ్య మధ్య మానేసినా, జీతం డబ్బులు విరక్కోసు కొనేవాడు కాని పనిలోకి రానివ్వననే వాడుమాత్రం కాదు. ఇదివరకు నెత్తురుపడేదికాదు. ఇప్పుడదికూడా సంపూర్తయింది...ఇహ యిక్కడ లాభం లేదు ... ఆరోగ్యాశ్రమాని కెక్కడికన్నా పొమ్మన్నారు వైద్యులు. అలాంటిచోటికెళ్లాలన్నా, వెళ్లి నాలుగునెల్ల పాటుండాలన్నా వందలతో పని, తప్పితే, వీళ్ల వల్లయ్యేదా ఏమన్నానా? ఒంటిమీదుండే ఓటి రెండువస్తువులూ యిదివరకే అమ్మేసింది భార్య, శలవుపెట్టినరోజుల్లో భుక్తికీ, సలహాలు చెప్పినవైద్యులకట్నాలికీని—ఆయనకా'నా' అనేవాళ్లు లేరు. తనవాళ్లా? ఎక్కడో దూరదేశంలో వున్నారు. అయినా వాళ్లుమాత్రం వందలు, ఎక్కడ పంపిస్తారు? లక్షాధికార్లు గనకనా? మొన్నీమధ్య తనచివరికూతురి పెళ్లికిగాను తల తాకట్టుపెట్టి తెచ్చినబాకీ తీర్చలేక మొలలోతుల్లో దిగబడున్నాడు ఆండనాన్న. పోనీ షాహుకారును ఏమన్నా అడుగుతే? ఈ ఉద్దేశం బాగుం దనుకుంది భార్య. అవునూ, అన్నేళ్లనుంచీ తనదగ్గిర పనిచేస్తున్నాయనకి కష్టసమయంలో ఆ మాత్రం సహాయం చెయ్యడూ? నయమైంతర్వాత క్రమంగా తీరుస్తారూ అప్పు ... భర్తతో ఓరోజు ప్రస్తావించిం దీవిషయం. "...లాభంలేదే?...ఇవ్వడాయన...ఏంచూసిస్తాడూ? ... ఓవేళ యిస్తాడనుకో ... ఇచ్చినా శవంకోసం ఎందుకీఖర్చు? ... నేనెలాగూ బతకను..." అన్నాడు నిరాశగా భర్త. ఇలాంటి అపశకునపుమాటల కావిడ క్రమంగా అలవాటుపడ్డది.

"...మీ మాటలకేం కానీండి, ఓఉత్తరమ్మొక్క రాసి చూడరాదూ, అయినా?...సానుభూతిగా మాట్లాడుతూండేవా డన్నారయ్యే...ఆమాత్రం సహాయం చెయ్యకపోతాడూ?..."అని బలవంతపెట్టింది. తనకేమాత్రం ఆశలేకపోయినా, భార్యని తృప్తిపరచటానిగ్గాను... "నేను చావుబతుకుల్లో ఉన్నా...ఆరోగ్యాశ్రమం వెళ్లాలని వైదుల్లన్నారు. నే నడగలేకపోతున్నా...నాఆస్తి ఏంచూసి ఇవ్వమనగలనూ?...అయిదువందలవుతాయిట, రైలు ఖర్చులకూ అక్కడ నాలుగునెలల పాటుండటానికీని ... బతికితే ఆజన్మాంతం మీదగ్గిరే పనిచేస్తూ తీర్చుకుంటా..." అని ఓఉత్తరం రాశాడు.

3

కాగిత మ్ముక్కన్నా రాయించుకోకుండా షాహుకా రయిదువందలూ చేతిలో పోసినందు కతని కెక్కడలేని ఆశ్చర్యం వేసింది. మనస్సులో శతవిధాల అతనికి ధన్యవాదా లర్పించుకొంటూ అతని గుణగణాలను తలుచుకోటం మొదలెట్టాడు...నిజాని కాయన ధర్మమూర్తి. తను మధ్యమధ్య పని మానేసినా ఏమీ అనేవాడుకాదు. అదీగాక "ఏదన్నా మందు పుచ్చుకోరాదుటండీ" అంటూ సానుభూతిగా మాట్లాడుతూ ... "పాపం, యింట్లో వంటరిగాళ్లు కామా"లని జాలిపడేవాడు కూడాను.

"ఆయనచేసిన దానధర్మాలకు లెక్కేలేదు. మహా జాలిగుండె కలవాడు. మొన్నీమధ్యేకదూ పడమటివీధిలో సత్రం వేయించిందీ?...ఆ రోజు అనాధాలయానికి చందా కొచ్చి నాయనకి తన చేత్తోనేగా, వెయ్యి

రూపాయ లిచ్చింది? వెధవ అయిదువంద లాయనకో లెక్కేమిటి? ఒక్క నెలలో యిలాంటి అయిదువందలు తొంభై ఒస్తా యాయనకి!!..."

ఇన్ని సుగుణాల పోగైన ఆయన్ని మొదట్లో తాను కఠోరుడుగా అనుకున్నం దుకు మహా నొచ్చుకున్నాడు రోగి. తన పశ్చాత్తాపాన్నీ, కృతజ్ఞతనీ సూచిస్తూ ఇంకో ఉత్తరం రాసి పంపించాడు...అది చూసి షాహుకా రేమనుకున్నాడో!...

౪

"సరీగ్గా యివాలిటి కేడా దైంది. నీకు గుర్తుందో లేదో...మీా ఊళ్లో పెద్ద పెంకు టింట్లో మామిడిచెట్టున్న వేపుగదిలో... లేతమామిడి చిగుళ్లల్లోంచి ఒడపోసిన వెన్నెల దక్షిణం వేపు కిటికీలోంచి పరుపు మీాదికి పడుతుంటే...మన మసలా రాత్రి నిద్రే పోలేదు..." అన్నాడు భర్త.

భార్య మాట్లాడలేదు. మంచంమీాద బోర్లపడుకుని కిటికీలోంచి, శూన్యంలోకి చూస్తోంది. భర్త మరింత దగ్గిరిగా జరిగి కూర్చుని మెడపక్కని భుజపు ఎముకల గుంటల్లో తన మునివేళ్లతో చక్కిలిగిలి పెడుతూ... "అప్పు డనుకున్నాం ... అటు వంటి సంతోషపు ఘడియలు మళ్లీ రావ టానికి పొడుగాటి సంవత్సరం అడ్డం ఒస్తుం దని?..." అని ఒంగి భార్యతల్లో ఉన్న గులాబీపువ్వు వాసనచూసే నెపంతో ఘుమ ఘుమలాడే నల్లజుట్టుని ముద్దెట్టుకో పోయా డు. ఆవిడ, చేత్తో అడ్డం పెట్టి దీర్ఘమైన నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పుకి, వంపులు పోయిన ఆమె శరీరపుసొంపులు జాగ్రత్తగా తిలకిస్తూన్న భర్త, ఉత్సాహంతో పొంగి పోయి, వెనకనుంచే భార్యని కౌగలించుకొని లేవనెత్తి ఆమెమొహాన్ని తనవేపుకు తిప్పు కుంటానికి ప్రయత్నిస్తూ..."...ఏ మంటా వు?..." అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

ఆమె తప్పించుకుని మొహం అటు తిప్పుకునే..."...మరి నేనోమా టడుగుతా కాని..." అని అర్థోక్తిలోనే ఆపేసింది.

"...సొంతం చెప్పు మరి ..." అన్నాడు భర్త చేతు లక్కడే వుంచి.

"...ఉండండి మరి చెపుతా...ఓ భార్యా భర్తా వుంటారు...మిక్కిలి అనురాగంగా ..." అంది ఆపి ఆపి.

"మనం లేమూ?..." అని ప్రశ్నిం చాడు జవాబుగా భర్త.

"భర్తని భార్య తన ప్రాణంకంటే ఎక్కు వగా ప్రేమిస్తుంది." అంది కొంచెం దూకు డుగా.

"...భర్తో మరి?..." అన్నాడాయ నాధోరణిలోనే.

"భర్త క్షేమంకోసం భార్య అష్టకష్టా లూ పడుతుంది. తప్పా?..."అంది అదోవిధ మైన ఊపుతో.

"ఎవ రంటారు?..." అన్నా డాయన. అతనికి విషయ మేమీా అర్థం కాలేదు.

"తను ప్రాణప్రదంగా కాపాడుకునే వస్తువు లన్నిటినీ భర్తసౌఖ్యంకోసం ధార పోస్తుంది...తప్పా?" అంది మరీ దూకుడుగా. ఆ దూకుడులో మాటలు తడబడ్డాయికా స్త.

"...ఔతే ఏమంటావు? ఇంతకీ..." అన్నాడు భర్త కాస్త ఆలోచనా పూర్వకంగా.

"అది కాదండీ... తనసౌఖ్యం, ధనం, మానం ... అర్పిస్తుంది భర్తసౌఖ్యంకోసం ...అలాంటిదా న్నేం చెయ్యాలి?..."అంది కాస్త గుక్కతిప్పుకొని ..."ప్రాణప్రదాయినిగా ఎంచుకొని..."అని భర్త ఏదో చెప్పబోతుంటేనే భార్య అందుకుని..."ఛీ...చంపెయ్యొద్దుటండీ...?..."అంది అని లేచింది. మొహం గంభీరంగా వుంది. ఊపిరి బరువుగానూ త్వరత్వరగానూ విడుస్తోంది. అదురుతున్న గుండెలు తొలిగిపోయిన వస్త్రాల్లోంచి బాగా కనిపిస్తున్నాయి. పెదిమెలు ఒణుకుతున్నాయి. అతని కేమీ బోధపడలేదీ వాలకం.

"చచ్చిపోవద్దుటండీ? ... ..." అంది మళ్లీ ఆవిడే, భర్తమొహంలోకి తీక్షణంగా చూస్తూను.

"ఆ...ఆఁ నిజమే — సానుభూతిలేని భర్త ... ఏం అలా చూస్తావేం?" అన్నాడాయన.

"ప్రాణంకంటే ఎక్కువది ... కూడా ధారపోసినా ?" అంది...

"ఆఁ ... పూజించాలి నెత్తిన పెట్టుకొని ... దాస్యం చెయ్యాలి ఆ జన్మమూను" ... అన్నాడు గంభీరంగా లీలగా అతనిక్కాస్త ఏమిటో అర్థం అవుతున్నట్టుంది.

"నిజంగా అంటున్నారా?..." అంది యీడుస్తూను. కళ్లు తేలిపోతున్నాయి. చిరునవ్వు పెదిమెలచివర కాస్త తొంగిచూసి వెళ్లిపోయింది. వెన్నెలకాయిస్తున్న చంద్రుడిని నల్లమబ్బులు కప్పేశాయి—

"ఏమి టిదీ?..." అన్నాడు భర్త ఆదుర్దాగా. ఆవిడమొహంలో వివర్ణత ఏర్పడింది. కళ్లు బాగా మూసుకుపోతున్నాయి.

"కాసిని మంచినీ ళ్లిస్తారూ?"... అంది అస్పష్టంగా. భర్త వికలత పొందాడు.

"అలా మాట్లాడుతున్నావేం?... నిద్దరొస్తోందా?" అంటూ నీళ్లందించాడు మరీ భయపడుతూ. నీళ్లు కాసిని తాగి గ్లాసు జారవిడిచింది. భర్త గాభరాపడిపోతూ ... "అయ్యో తలవేలాడేశావేం? ...అరే? ... చూస్తూచూస్తుండగానే ఏమిటీ ప్రళయం?... చూడూ... డాక్టర్ని పిలుస్తున్నా..."నంటూ కంగారుగా మంచందిగాడు. భర్త చెయ్యిపట్టుకుని ఆపి బాగా యీడుస్తున్న నంగి మాటల్తో..."డాక్టరొద్దు...నన్ను...క్షమించారు...కదూ?... ప్రాణంకంటె మానం గొప్పది..."అంది కళ్లు మూసుకునే.

భర్తకి మరీ అగమ్యగోచరమైంది. కళ్లు గిర్రున తిరిగాయి. ఒణికిపోతూ ... "నా గుండెలు పగిలిపోతున్నాయి ... ఇంతలోనే యిలా ముంచుకొచ్చిందేం? ... నన్నెవరు క్షమిస్తారూ... ఇహ? ..." అన్నాడు గద్గద కంఠంతో. మళ్లీ మంచినీళ్లకి సంజ్ఞ చేసిందావిడ. అందిచ్చాడు బిగ్గరిగా బాగా ఏడుస్తూనే.

నీళ్లు కాసిని తాగి కళ్లు తెరవటానికి ప్రయత్నిస్తూ "...అదేమిటీ?...నా దగ్గిరికి రండీ... నేను చేసింది తప్పుకాదు...ఈ శరీరం మీద మీకు హక్కుపోయింది..." అంది తూలుడుగా...

"నేను మాత్రం ఏం తప్పు చేశాను? ...నన్ను నట్టేట్లో ముంచేశావేం? ... అయ్యో ... వైద్యుడిని పిలవనియ్యి ..." అంటూ చెయ్యి విడిపించుకోటానికి ప్రయత్నించాడు...

"వద్దు... ఈ చివరి రెండు నిముషాలు నా దగ్గిరిగా వుండరూ?..." అని భర్తతల తన గుండెలమీదికి లాక్కుంది. "మీకు బాగా ఆరోగ్యంగా వుందిగా?...నన్ను క్షమించారు కదూ? ... శలవిస్తారా?..." అంటూను... మరోమాటు మంచినీళ్లకు సంజ్ఞ చేసింది ... మేజామీది చెంబులో నీళ్లు గ్లాసులో పోస్తుంటే, గోడకీ మంచానికీ మధ్య పడిన ఊడిపోయిన ఓ కాగితంపొట్లం అప్పుడే కిటికీలోంచి వచ్చినగాలివిసురుకి అతనికాళ్ల ముందు కొచ్చిపడింది.

"...అమ్మో ... నాతోడు ...వద్దు... వద్దు...ఇంకా మిగిలిందా?..." అని లేవబోతూ భార్య ఎంత మొరపెట్టుకున్నా వినకుండా ఆ పొట్లంలో మిగిలిన కాస్తపొడి నోట్లో పోసుకున్నాడు భర్త...ఆ వాక్కు అతని కుంది.

మూలవ్యాధి

"ఒక యోగిపుంగవునిచే ప్రసాదింపబడిన అద్భుతమగు ఔషధరాజము"

రక్తము కారుచున్నను. కారకపోయినను, నూతనముగా కలిగినదైనను, చిరకాలమునుండి ఉన్నదైనను పైభాగముననున్నను, లోపలిభాగముననున్నను. ఎట్టిస్థితిలోనున్నను అర్ష-మూర ఒకసారి పూసినచో అమోఘముగా పనిచేయును. బాధ, దురద, మంట, చీము, నెత్తురుకారుట, వెంటనే ఆగిపోవును. మూడుదినములు వాడినంతనే యెంతటిమొండిదైన మూలశంఖగాని, భగందరముగాని శస్త్రచికిత్స లేకయే పూర్తిగానుదురును. వేలకొలదిమందిరోగులు ఈమందువలన ఉపశమనముబడసి, తదితరులకు శిఫార్సు చేయుచున్నారు. కుదురకపోయినచో సొమ్ము వాపసు చేయబడును. ఖరీదు రు. 2-0-0.

AROGYA SADAN,

ఆరోగ్యసాధన్, దుర్గాదేవి వీధి, బొంబాయి